క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



గౌతమ్ పొట్రుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొట్రును శనివారం కొత్తగూడెంలోని డైరెక్టర్ చాంబర్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిశారు. టేకులపల్లి, ఇల్లెందు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సింగరేణి ఓబీ మట్టి తొలుకునేందుకు అనుమతి ఇవ్వాలని, పూసపల్లి ఓసీ పనులు వెంటనే చేపట్టాలని, సింగరేణి భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మడుగు సాంబమూర్తి, బొల్లి రాజు, శ్రీ హరిహర క్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సంఘం సభ్యులు

చుంచుపల్లి: తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జ్యోతి అనాథ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, సురేష్ కుమార్, పాండురంగారావు, శివరామకృష్ణ, సీతారామ శాస్త్రి, జోసెఫ్, కామేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ప్రమాదాలను నివారించండి..

పాల్వంచ: వంటగ్యాస్‌తో జరిగే ప్రమాదాలను నివారించాలని పౌరసరఫరాల సంస్థ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు పొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని, మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 గ్యాస్ సిలిండర్ పొందాలని, గ్యాస్ పైపు తీసుకుని ఐదేళ్లు దాటితే రూ.190తో సురక్షిత పైపు అందించడం జరుగుతుందన్నారు. తనిఖీ చేసినందుకు రూ.236 చెల్లించడం చెల్లించాల్సి ఉంటుందని, ఇలా చేయించుకున్న వారికి ప్రమాదాలు జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

జూలూరుపాడు: పడమటనర్సాపురం రైతు వేదికలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాపకొల్లు, భేతాళపాడు, అన్నారుపాడు, మాచినేనిపేటతండా, కాకర్ల గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

హైపర్ వేతనాలు ఇవ్వండి..



హాజరైన కాంట్రాక్ట్ కార్మికులు

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులకు హైపర్ వేతనాలు ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులో సమావేశమైన కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేతలు నబీ, రాంసింగ్, యాకుబ్‌షావలీ మాట్లాడారు. 22 జీఓ అమలు చేయాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల వెంకటేశ్వర్లు, టి.కృష్ణ, రఘు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి



ఇల్లెందురూరల్: లచ్చగూడెంలో ఉట్టి కోసం కర్రమీదకు ఎగబాకుతున్న యువకులు



పాల్వంచరూరల్: పాతసూరారంలో వేడుకలో పాల్గొన్న స్థానికులు





కొత్తగూడెంటౌన్: కృష్ణుడు, రుక్మిణిగా చిన్నారులు



జూలూరుపాడు: గోపిక వేషధారణలో వనిత

శ్రీకృష్ణుడు, రాధాగోపికల అలంకరణలో ఆకట్టుకున్న చిన్నారులు

కొత్తగూడెంటౌన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడి వేశధారణలో ఆకట్టుకున్నారు. కొన్నిచోట్ల మార్వాడీ క్యాంప్‌లు జరుపుకున్నారు. ఆలయాల వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలతో గోవుల కృష్ణ గోపాల కృష్ణ అంటూ.. కోలాట నృత్యాలు చేస్తూ సంతోషంగా పండుగ జరుపుకున్నారు.

పాల్వంచరూరల్: పాండురంగాపురం, సూరారం, పాతసూరారం గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాండురంగాపురం, యాదవ్ యువసేన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడి విగ్రహ ప్రతిమకు పూజలు చేశారు. సూరారంలో యువకులు ఆనందోత్సాహాలతో ఉట్లు కొట్టి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, గ్రీన్‌ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు రమేష్ రాథోడ్, అఖిల భారత యాదవ మహాసభ యువజన రాష్ట్ర కార్యదర్శి వల్లపు యాకయ్య, సాంబయ్య, ఎం.శ్రీనివాస్, జయప్రకాశ్, వెంకట్, చందు, మార్గం అంకయ్య, పాతసూరారంలో ఉడుగుల ప్రశాంత్ యాదవ్, దేవన బోయిన నరేందర్, మైల నిశాంత్, ఎల్లబోయిన రామకృష్ణ, జక్కుల ఉజ్వల, తేజస్విని పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని ప్రజలు శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాకర్ల పాలగుట్టపై ఉన్న శ్రీ రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పంచామృతాలతో అభిషేకం, గోత్రానామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆదిశేషుడు విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకంలో భాగంగా ప్రధాన కలశాలతో ఆలయ చైర్మన్ ఢిల్లీ వెంకటేశ్వర్లు, హైకోర్టు న్యాయవాది హరిశ్రీధర్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం, జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. కొమరారం, నాయకుగూడెం గ్రామాలలోని శ్రీకృష్ణుని ఆలయాలలో శ్రీకృష్ణునికి భక్తులు ప్రత్యేక పూజ చేశారు. లచ్చగూడెం, బొంబాయితండా, సుభాష్‌నగర్ గ్రామాలలో పలువురు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. గ్రామాల కూడళ్లలో కర్రకు ఫలహారాలు కట్టి వాటిని అందుకునే ప్రయత్నంలో గ్రామమంతా సంబురాల్లో మునిగిపోయింది. కర్ర ఎక్కుతున్న యువకులపై పెద్దలు, మహిళలు నీళ్లు చల్లుతూ ఆనందంగా వేడుక చేసుకున్నారు.

టేకులపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. పిల్లనగ్రోవితో చిన్నారుల ఆటపాటలు అలరించాయి. పలు ఆలయాల్లో స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు.





కొత్తగూడెంలో...





టేకులపల్లి: మంగళితండాలో.. మొక్కంపాడుతండాలో



జూలూరుపాడు: వేణుగోపాల స్వామి ఆలయంలో పూజ చేస్తున్న ఢిల్లీ వెంకటేశ్వర్లు, హరిశ్రీధర్



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో కృష్ణుడి ప్రతిమకు పూజలు చేస్తున్న స్థానికులు





జూలూరుపాడులో...



టేకులపల్లిలో...



ఇల్లెందులో...



టేకులపల్లిలో కృష్ణుడు, యశోద వేషధారణలో..

పాటల పోటీల్లో రాణించిన కీర్తన

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం జరిగిన సెమీ ఫైనల్ మెగా పాటల పోటీల్లో ఖమ్మం జిల్లాకు చెందిన కీర్తన తృతీయ బహుమతి సాధించినట్లు రాష్ట్ర చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ విల్సన్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న జిల్లా స్థాయి కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో కీర్తన విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు.

‘అర్హులకు మొండి చేయి’

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులకు మొండి చెయ్యి చూపిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ విమర్శించారు. శనివారం జూలూరుపాడులో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. పూరిగుడిసెలు, ఇంటి స్థలం ఉన్న వారికి ఇవ్వకుండా, భూములు, ట్రాక్టర్లు, కార్లు ఉన్నవారికి ఇళ్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతోందన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను అధికారులు ఎంపిక చేసేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆదివారం జూలూరుపాడు మండలంలో ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. యాసా నరేష్, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, పద్దం సుగుణ, రెడ్డిబోయిన గోవిందు, మాళోత్ రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు ‘ఏఐ’పై పట్టు సాధించాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

పాల్వంచ: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, ఏఐ ఇన్నోవేషన్‌పై దృష్టి సారించాలని యాక్సియా ఐవంటేజ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఏఐ టూల్స్‌ను నేర్చుకోవడం ద్వారా ఎక్స్‌పరమెంట్, ప్రాక్టికల్ రీసెర్చ్, విద్యా వృద్ధి చెంది ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. చైర్మన్ భరత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న, డైరెక్టర్ ఎస్‌వీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో స్ట్రక్చరల్ సమావేశం



సమావేశంలో అధికారులు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో శనివారం గుర్తింపు సంఘంతో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) చాంబర్‌లో నిర్మాణాత్మక స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు 10 అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. మెయిన్ ఆస్పత్రిలో కొత్త 2డి ఎకో, స్పిగ్మోమానోమీటర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. మెయిన్ వర్క్‌షాపు, సెంట్రల్ వర్క్‌షాపులో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్లు, క్లర్కులు, టిండాల్ పోస్టులు భర్తీ చేయాలని, అదేవిధంగా ఉద్యోగులకు డ్యూటీ డ్రెస్‌లు పంపిణీ చేయాలని తెలిపారు. ఎక్స్‌ప్లోరేషన్ విభాగాల సిబ్బందికి కొత్త డ్రిల్ బిట్లు, రాడ్లు, రెయిన్ కోట్లు అందించాలని విన్నవించారు. ఎండీ టైప్ క్వార్టర్లకు పెయింట్స్ వేయించాలన్నారు. బర్లీఫిట్, హేమచంద్రాపురం పంపుహౌజ్‌ల వద్ద పంపు ఆపరేటర్లుకు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల నిర్మించాలని కోరారు. కార్పొరేట్ ఏరియాలోని కంపెనీ క్వార్టర్ల పక్కనున్న ఖాళీస్థలాన్ని శుభ్రం చేయాలని చెప్పారు. హెడ్డాఫీస్ క్యాంటిన్‌లో భోజన సదుపాయం లిమిట్ లేకుండా చేయాలని, 2023–24, 25 సంవత్సరాల క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందించాలని విన్నవించారు. స్పందించిన జీఎం త్వరలో సమస్యలకు పరిష్కారం చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో రాయల చంద్రశేఖర్ నగర్‌లో జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, చిన్న చంద్రన్న, ముద్దా భిక్షం తెలిపారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్.రాజు, బుర్ర వెంకన్న, ఈసం శంకర్, బుర్ర రాఘవులు, శాంతయ్య, శ్రీకాం కోటయ్య, బొర్ర వెంకన్న, దుర్గారావు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తగూడెంటౌన్: గణేష్ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మండలపాల వద్ద డీజే సౌండ్ సిస్టం వినియోగించవద్దని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శనివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఎం.కరుణాకర్ ఆధ్వర్యంలో వినాయక మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. ఈ నెల 27న వినాయక చవితి పండుగ ఉన్నందున ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు ఈ కార్యాక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండపాల వద్ద పోలీసులు, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు తెలిపిన నిబంధనలు పాటించాలన్నారు. మండపం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్లప్పుడు ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా జరిగితే నిర్వాహకులదే బాధ్యత అన్నారు. ఏదైనా గొడవ జరిగే అవకాశం ఉంటే డయల్ 100కు ఫోన్ చేయాలని, నిమజ్జనం రోజున క్రాకర్స్ ఉపయోగించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి, వన్‌టౌన్, త్రీటౌన్ ఆర్‌వీ.వెంకటేశ్వర్లు, కరుణాకర్, శివప్రసాద్, ఎస్‌ఐలు రమణారెడ్డి, రవి, రాకేష్, విజయ, బేగ్ పాల్గొన్నారు.



కొత్తగూడెంటౌన్: మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

టేకులపల్లి: గణేష్ మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలని టేకులపలి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై అలకుంట రాజేందర్ సూచించారు. టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు పంచాయతీల్లోని గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో శనివారం మాట్లాడారు. పరమత సహనంతో వేడుకలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

నిస్వార్థ సేవకుడు అయోధ్యాచారి

టేకులపల్లి: పేదప్రజల కోసం నిత్యం పనిచేసే నిస్వార్థ సేవకుడు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్యాచారి అని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్‌చందర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి కార్యాలయంలో అయోధ్యచారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాట్లాడుతూ... ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయ సాధన కోసం ఐక్యమత్యంతో పార్టీని ముందుకు నడిపించాలని తెలిపారు. ఆదివారం మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు అయోధ్యాచారి సంతాపసభ ప్రారంభం అవుతుందని ప్రజా సంఘాలు, సానుభూతిపరులు అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయిత శ్రీరాములు, ఎజ్జు భాస్కర్, గుగులోతు శ్రీను, బానోతు వీరన్న, తేజావత్ మధు, ఇస్లావత్ రవీందర్, సతీష్, గుగులోతు సోని తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

- కురుస్తున్న గదులు
- మూలన పడిన నీటిశుద్ధి పరికరం
- అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శిథిలావస్థకు చేరిన కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల

కొత్తగూడెంఅర్బన్: దశాబ్దాల చరిత్ర ఉన్న పాఠశాల ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాలను అధిరోహించారు. తద్వారా పాఠశాలకు కూడా మంచి పేరు వచ్చింది. కానీ, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండు కూడా శిథిలావస్థకు చేరున్నాయి. ప్రస్తుతం ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో 300 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే పాఠశాల దశాబ్దాల చరిత్ర ఉంది కానీ అప్పటి నుంచి కూడా ఇప్పటి వరకు అదే రేకుల గదులలో తరగతి గదులు, ఉపాధ్యాయుల స్టాఫ్ రూంలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, విద్యార్థులు చదువుకునే పాఠ్య పుస్తకాలతో పాటుగా సామాజిక స్పృహ కల్పించే పుస్తకాలు భద్రపరిచే గది ఇలా అన్నీ శిథిలావస్థలోనే ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అన్ని గదులూ కురుస్తున్నాయి. దీని వలన విద్యార్థులకు బోధన సైతం కష్టంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. స్టాఫ్ రూంలలో కూడా ఏదీ భద్రపరుచుకునే పరిస్థితులు లేవంటున్నారు. వర్షపు నీటికి తడిసి రేకులకు చెమ్మపట్టి ఉందని, అవి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి ఉందని, దీని వలన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జరగరానిది ఏదీ జరగక ముందే జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేసి నిర్మించాలని కోరుతున్నారు.

పనిచేయని నీటి శుద్ధి పరికరాలు..

పాఠశాలలో మంచినీటి కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి పరికరాలు ప్రస్తుతం పని చేయడం లేదు. దీంతో పాటుగా పాఠశాలలో ఉన్న నీటి ట్యాంకు పంపులు కూడా పని చేయడం లేదు. దీని వలన మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో బోరు నీటినే తాగునీరుగా వాడుకోవాల్సి వస్తోంది. వీటితో పాటుగా పాఠశాలలో ఉన్న బాలికలు, బాలురకు సంబంధించిన టాయిలెట్లకు సంబంధించిన పైపులైన్ వ్యవస్థ మొత్తం మరమ్మతులకు గురయింది. దీని వలన పైపులైన్ లీకేజీ వలన పాఠశాలలో దుర్వాసన వెదజల్లుతోంది. పైపులైన్‌ను వెంటనే మరమ్మతులు చేయించకపోతే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడం వలన దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పాఠశాలలో మున్సిపల్ అధికారులు ఫాగింగ్‌తో పాటు పైపులైన్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి కూలీలైన్ పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన నీటిశుద్ధి పరికరాలు

వరద నీటిలో జలపుష్పాల వేట

అధిక వర్షాల కారణంగా మండలంలోని వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. కల్వర్టులు, బ్రిడ్జిలు, అలుగుల వద్ద భారీగా వరద పోటెత్తుతోంది. బేతంపూడి చెరువుతో పాటు పలు చెరువుల అలుగుల వద్ద స్థానికులు శనివారం వలలతో చేపలను వేటాడారు.

– టేకులపల్లి



బేతంపూడి చెరువు వద్ద చేపలు పడుతున్న స్థానికులు